మనసుతో ఆడొద్దు

సెల్ మోగుతుంటే నెంబరు చూసి ఆఫ్ చేసింది శిల్ప. మొహం చిట్లించి "ఇడియట్" అంది పళ్ళ బిగువున. పక్కన కూర్చున్న అఖిల "ఏయ్! ఎవరు? ఎందుకు స్విచ్ ఆఫ్ చేసావు? రాహులా? పాపం ఎందుకే అలా అతన్ని అవాయిడ్ చేస్తున్నావు ఈమధ్య?" అంది.

"నీకేం తెలీదు. మాట్లాడకు," విసుగ్గా అంది శిల్ప.

"నాకెందుకు తెలీదు, ఏడాదిగా ఈకాల్ సెంటర్ జాబ్‌లో చేరిందగ్గిర నుంచి మీ స్నేహం చూడలేదా, ఈ ఏడాదిలో మీరెంత సన్నిహితంగా మెలిగిందీ చూడలేదా. నెలరోజుల నుంచి అతన్నిలా ఎందుకు దూరం చేస్తున్నావో చూడడం లేదా. పాపం ఆ రాహుల్ మొహం చూసావా ఎలా పీక్కుపోయిందో! రోమియోలా తయారయ్యాడు. రాహుల్ ఏమన్నా మిస్ బిహేవ్ చేసాడా? అదే అయితే ఫ్రాంక్‌గా అతనితో చెప్పచ్చుగా!" నిష్ఠూరంగా అంది అఖిల.

"షటప్ అఖిలా! నీకేం అర్థం కాదు. మాట్లాడకుండా కూర్చో!" కోపంగా అంది శిల్ప.

"ఓ.కె. చెప్పడం ఇష్టంలేకపోతే మానేయ్! కాని రాహుల్ లాంటి మంచివాడిని దూరం చేసుకుంటే నష్టపోయేది నీవే." తన పాయింట్ దగ్గర క్యాబ్ ఆగగానే విసురుగా వెళ్ళిపోయింది అఖిల.

అసహనంగా కూర్చున్న శిల్పని వింతగా చూసింది భావన. గతవారంలోనే ఉద్యోగంలో చేరిందేమో, ఆమెకేమీ అర్థంకాలేదు. ముందు సీట్లో కూర్చున్న సందీప్

వెనక్కి తిరిగి "శిల్పా! వైడోంట్యూ హేవ్‌యే టాక్ విత్ హిమ్? అపార్థాలుంటే మాట్లాడి తీర్చుకోవచ్చు గదా! తప్పించుకు తిరగడం ఎందుకు?"

"షటప్ యార్. సలహా అడిగినపుడు ఇద్దువుగాని" కసిరింది శిల్ప. చిన్న పుచ్చుకున్నాడు సందీప్. తన పాయింట్ రాగానే దిగివెళ్ళింది శిల్ప."

* * * * * *

మర్నాటు నైటిషిఫ్ట్ పూర్తయి అర్ధరాత్రి బయటకొచ్చిన క్యాబ్ ఎక్కబోతుంటే రాహుల్ హఠాత్తుగా వచ్చి క్యాబ్ తలుపు పట్టుకు ఆపి "శిల్పా! నీతో మాట్లాడాలిదిగు. నా బైక్‌మీద వెడదాం!" చాలా శాంతంగా, సూటగా ఆమె వంక చూస్తూ అన్నాడు. శిల్ప ఒక్క క్షణం చకితురాలై, తరువాత కోపంగా చేయి విదిల్చి "ఈ అర్ధరాత్రి నీ బైక్‌మీద రావాలా? ఆర్ యు క్రేజీ ..." అంది తీక్షణంగా చూస్తూ.

"మతి ఇంకా పూర్తిగా పోలేదు. చాలా మాట్లాడి తేల్చుకోవాలి నీతో! రా..." పంతంగా అన్నాడు.

"ఏయ్! ముందు చేయి తీయి. మాట్లాడాల్సి ఉంటే రేపు మాట్లాడొచ్చు." అడ్డులే! రాహుల్ చేయి వదలకుండా శిల్ప వంక తీక్షణంగా చూసి ఏదో అనబోతుంటే అఖిల కల్పించుకొని "రాహుల్! ప్లీజ్! ఈ అర్ధరాత్రి ఇక్కడ సీనేం చెయ్యకు, రేపు పగలు మాట్లాడొచ్చు. మమ్మల్ని వెళ్లనీ డ్రైవరు ఎదురు చూస్తున్నాడు" అంది నచ్చచెప్తూ.

"నీకు తెలీదు అఖిలా! రేపు మాట్లాడదు. ఫోన్ కట్ చేస్తుంది. ఎస్సెమ్మెస్‌లకి జవాబివ్వదు. ఈ-మెయిల్‌కి రెస్పాన్సవదు. నన్నుకావాలని తప్పించుకుంటోంది." చిన్నపిల్లాడిలా ఉక్రోషంగా అన్నాడు.

"కాదు రాహుల్! నేను తన తరఫున మాటిస్తున్నాను. శిల్పని ఎక్కడికి రమ్మంటావో చెప్పు, నేను పంపిస్తాను. ఇట్స్ మై ప్రామిస్! అంది అనునయంగా.

"ఓ.కె. నీ మాట నమ్ముతాను. రేపు లంచ్‌కి మినర్వాకి పన్నెండుకి రావాలి." క్యాబ్ పైనించి చెయ్యి వెనక్కి తీసి చూడకుండా బైక్ స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు.

"ఇడియట్ అర్ధరాత్రి వచ్చి న్యూసెన్స్ చేస్తాడా? రేపు నేనొస్తానని ఎందుకు చెప్పావు?" ఎగిరింది శిల్ప.

"బుద్ధిలేకుండా మాట్లాడకు. చెప్పకపోతే అర్ధరాత్రి రోడ్డుమీద గొడవ పెట్టుకుంటావా? డ్రింక్ చేసి ఉన్నాడు రాహుల్." కారులో కూర్చున్నాక కోపంగా అంది

అఖిల. "ఇదిగో శిల్పా ఓసారి రాహుల్‌ని కల్సుకుని ఇద్దరూ మీ సమస్యలేమిటో మనసు విప్పి మాట్లాడుకోండి. అతనితో స్నేహం వద్దనుకుంటే, కారణాలు నిజాయితీగా చెప్పు!" సలహా ఇచ్చింది.

"నాకిష్టం లేదన్నది అర్థం చేసుకోకుండా ఎందుకిలా వెంటపడి విసిగించాలి? ఎదురుగా చెబితే ఏదో అంటారు. నమ్మించాలని చూస్తాడు. వాదిస్తాడు. బతిమిలాడతాడు. ఈ గోలంతా నేను పడలేను." చిరాగ్గా అంది శిల్ప. అఖిల ఆశ్చర్యంగా చూసింది.

"ఏమయిందే నీకు, సడన్‌గా ఎందుకు రాహుల్‌ని వద్దనుకున్నావు? కారణం చెప్పకుండా ఇలా ఏడిపించడం బాగోలేదు."

"మా ఇంట్లో వాళ్ళు నాకు అమెరికా సంబంధం చూసారు. రాహుల్‌ది, మాది ఓ కులం కాదు. ఇంట్లో ఒప్పుకోరు. స్నేహం అంటూ తిరిగితేనే తిట్టేవారు. రాహుల్ కుటుంబ వాతావరణం నాకు నచ్చలేదు. వోల్డ్ ఫ్యాషన్."

"మరలాంటప్పుడు మొదట్లోనే కట్ చెయ్యాల్సింది."

"చదువుకున్నాడు. మంచివాడు గదా అని స్నేహంగా ఉన్నాను. చాలా సాయం కూడా చేసాడు. అంత మాత్రాన పెళ్ళిచేసుకోవాలా?" దబాయింపుగా అంది.

"శిల్పా! నాదగ్గిర చెప్పకీ కబుర్లు. ఉత్తి స్నేహం అంటే నమ్ముతానా? మీరిద్దరూ ఎంత దూరం వెళ్ళారో నాకు తెలుసు. నీకు కొత్తగా అతని కులం గురించి, కుటుంబం గురించి ఇప్పుడే తెల్సిందా? అమెరికా పెళ్ళికొడుకు రాగానే, రాహుల్ కంటికి ఆనలేదని చెప్పు" హేళనగా అంది అఖిల. ఉక్రోషంగా చూసింది శిల్ప.

"అలాగే అనుకో". తలెగరేసి పొగరుగా అంది.

"ఇప్పటికైనా నిజం చెప్పు. అతనికి ఇంకా ఆశలు కల్పించకుండ!" పాయింట్ రాగానే దిగిపోయింది శిల్ప. రాత్రి ఎంతోసేపు నిద్రపట్టక దొర్లుతూనే ఉంది శిల్ప. రాహుల్‌ని ఎలా హ్యాండిల్ చెయ్యాలి? ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి?... తెల్లవారు తుండగా నిద్రపట్టింది శిల్పకి.

* * * * * *

"అఖిలా! శిల్ప లంచ్‌కి రానని చెప్పింది. రాహుల్ మరుసటి రోజు మధ్యాహ్నం ఆవేశంగా అన్నాడు ఫోను చేసి.

"రానందా? వదిలేయ్ రాహుల్. తనకంత లెక్కలేనపుడు, నీవెందుకు తన వెంట పడడం. స్నేహానికి ఫుల్‌స్టాప్ పెట్టేయ్!" అతన్ని శాంత పరచడానికి ప్రయత్నించింది. రాహుల్ టక్కున ఫోన్ పెట్టేసాడు.

ఐదుగంటలకి క్యాబ్ వచ్చే వేళకి తయారై బయటికి వస్తుంటే సెల్ మోగింది. సందీప్ చాలా గాభరాగా "అఖిలా! ఘోరం జరిగింది. రాహుల్ శిల్పమీద యాసిడ్ పోసాడు. శిల్పకి ఓ పక్క మొహం, మెడ బాగా కాలింది. హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు."

"మైగాడ్. ఎప్పుడు జరిగింది."

"పదిహేను నిమిషాలయింది. శిల్ప క్యాబ్ పాయింటిక్ వస్తుంటే హఠాత్తుగా బైక్‌మీద వచ్చి యాసిడ్ పోశాడు. నేను, భువన క్యాబ్‌లో ఉన్నాం. భువన శిల్పా వాళ్ళింటికి వెళ్ళి చెప్పింది. ఆస్పత్రిలో జాయిన్ చేసారు. వాళ్ళ నాన్నగారు పోలీస్ కంప్లైంట్ ఇవ్వడానికి వెళ్ళారు" జరిగిందంతా గుక్క తిప్పుకోకుండా చెప్పాడు.

"రాహుల్ ఎక్కడున్నాడు?"

"పోలీసులకి లొంగిపోవడానికి వెళ్తున్నానని వెళ్ళిపోయాడు."

"ఓ... " నేను ఆస్పత్రికి వస్తున్నా.

* * * * * *

పోలీస్ స్టేషన్ -

"అరగంట క్రితం నేనో అమ్మాయిమీద యాసిడ్ పోసాను. ఆ అమ్మాయి మొహం, మెడ కాలింది. వాళ్ళ వాళ్ళు ఆస్పత్రికి తీసుకెళ్ళారు." ఇన్‌స్పెక్టర్ కోపంగా కుర్చీలోంచి లేచి, రాహుల్ కాలర్ పట్టుకుని "రాస్కెల్! ఎంత ధైర్యంగా చెప్తున్నావురా? ఘనకార్యం చేసాననుకుంటున్నావా? నీవు చేసిన పనికి జైలుకెడతావన్నది తెలిసే చేసావా?"

"తెలిసే చేసాను. నేరం అని తెలుసు కనకే శిక్షకి సిద్ధపడే వచ్చాను" ప్రశాంతంగా అన్నాడు. ఇన్‌స్పెక్టర్ షర్టు వదిలి ఆశ్చర్యంగా చూసాడు.

"నీవెవరు? ఎందుకీ పని చేసావు?"

"నా పేరు రాహల్. ఇంజనీరింగ్ చదివి, ప్రస్తుతం ఓ కాల్ సెంటర్‌లో జాబ్ చేస్తున్నాను. అమ్మ, నాన్న, చెల్లి అంతా ఉన్నారు. మా నాన్నగారు బ్యాంక్ ఆఫీసరు." ఇంజనీరింగు చదివి మంచి కుటుంబంలోంచి వచ్చాడన్నది విన్నాక, గొంతులో కఠినం తగ్గించి "ఏమిటి ప్రేమవ్యవహారమా? ప్రేమించనుపొమ్మందా?" వ్యంగ్యంగా అన్నాడు.

"ముందే ప్రేమించను పొమ్మంటే ఈ పని చేసుండేవాడిని కాను, గత ఏడాది నుంచి ఈ కాల్ సెంటర్ జాబ్‌లో చేరిందగ్గర నుంచి మా పరిచయం స్నేహం ప్రేమగా మారింది. ఇద్దరం కలిసి తిరిగాం! మనసులు పంచుకున్నాం. శరీరాలు పంచుకున్నాం. తనని హోటళ్ళకి, సినిమాలకి, షికార్లకి తిప్పుతూ, ఎన్ని ప్రజెంటేషన్స్ ఇచ్చి ఎంతో డబ్బు తగలేసాను. మాది మధ్యతరగతి సంసారం. నాన్నగారు లోన్ పెట్టి చదివించారు. లోన్లు తీర్చకుండా జీతం అంతా తనతో తిరుగుతూ తగలేసాను. తను నిద్రకి ఆగలేకపోతే తనని పడుకోమని ఇద్దరి డ్యూటీ చేసేవాడిని. పెద్దవాళ్ళు అభ్యంతర పెట్టినా పెళ్ళాడాలనుకున్నాం. ఇంత జరిగాక, నెలరోజుల నుంచి నన్ను తప్పించుకు తిరుగుతుంది."

"ఇద్దరూ ఒకే చోట గదా పనిచేసేది. తప్పించుకోవటం ఏమిటి?"

"తనకి నెలక్రితం మంచి ప్లేస్‌మెంట్ వచ్చి ఇంకో జాబ్‌కి మారింది. అసలు నన్ను వదిలించుకోడానికే జాబ్ వదిలి వెళ్ళిందనిపిస్తోంది. అవాయిడ్ చేస్తూ ఏడిపిస్తూంది" కసిగా అన్నాడు.

అయితే మాత్రం యాసిడ్ పొయ్యటమేనా? కత్తులు పుచ్చుకుపోవడమేనా? ఎటు పోతుందయ్యా మీ యువత? అసలు అంత ప్రేమించినవాడివి యాసిడ్ ఎలా పోసావు?

ఆ నిర్లక్ష్యం, ఆ ద్రోహం సహించలేకపోయాను." బాధగా అన్నాడు.

"చూడు మిస్టర్! ఆవేశంతో నీవు చేసిన ఈ పనితో భవిష్యత్తు నాశనం అవుతుందని ఆలోచించావా?"

"నేనేమైనా ఫరవాలేదు. నా మనసుతో ఆడుకున్న ఆమెకి బుద్ధి చెప్పాలనే చేసాను. ఈతరం అమ్మాయిలు ఏం తక్కువ తినలేదు సార్. అబ్బాయిలని తళుకు బెళుకులతో, స్వీట్ టాక్‌తో చుట్టూ తిప్పుకుని తమ సరదాలన్నీ తీర్చుకుని, అక్కర లేదనుకున్న నాడు కరివేపాకులా తీసిపారేస్తున్నారు."

"మీతో ఇదే చిక్కు. ఆకర్షణని ప్రేమ అనుకుని తప్పటడుగులు వేసి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. చక్కగా చదువుకుని తల్లిదండ్రులు మీ శ్రేయోభిలాషులన్నది గుర్తించి వారు చెప్పినట్టు..."

"ఈ నిజం ఆలస్యంగా గుర్తించాను. అందుకే నాలాంటి అబ్బాయిలు ఈ నిజం గుర్తించాలని నన్ను నేను సమిధని చేసుకున్నాను. నా ప్రేమని చంపేసి సజీవ దహనం చేసింది. ఈ నిజం అబ్బాయిలంతా గ్రహించాలి."

"ఉత్త పిచ్చివాడిలా ఉన్నావు. ప్రేమ జీవితంలో ఓ భాగం అనుకోవాలి గాని ప్రేమే జీవితం అనుకుంటే భవిష్యత్తన్నది ఉండదు."

* * * * * *

"డాక్టర్ పేషంటుకి తెలివొచ్చిందా? స్టేట్‌మెంట్ తీసుకోవాలి" ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

"మరీ ఎక్కువ ఇబ్బంది పెట్టకండి. చాలా షాక్‌లో ఉంది" ఇన్‌స్పెక్టర్ తలూపి లోపలికి వెళ్లాడు.

"చూడమ్మా! నీవు ఈ సంఘటన గురించి ఏమన్నా చెప్పదలిచావా?"

"పట్టపగలు అందరూ చూస్తుండగా మొహాన యాసిడ్‌పోసి, వాడే వచ్చి సరెండర్ అయ్యాక, ఇంకా అమ్మాయి చెప్పడానికి ఏం ఉందండి?" శిల్ప తండ్రి వెంకట్రావు కోపంగా అన్నాడు.

"రాహుల్ ఎందుకు చేశాడు ఈ పని? అతనికి నీకు మధ్య గొడవ జరిగిందా? అతను నీ మీద ఇంత కక్ష కట్టడానికి కారణం ఏమిటి?" ఇన్‌స్పెక్టర్ ఏమీ తెలీనట్టు ప్రశ్నలు వేశాడు. శిల్ప కళ్ళు తెరిచింది. జవాబు చెప్పలేని దానిలా కళ్ళు వాల్చుకుని ఏడుస్తూ చేతులెత్తి నమస్కారం చేసి "నన్నేం అడగద్దు. నేనేం చెప్పలేను."

"మీరిద్దరూ ఒకేచోట పనిచేస్తారని, స్నేహితులని తెలిసింది. సన్నిహితంగా ఉండేవారని అంతా చెప్పారు. అలాంటప్పుడు ఇంత దారుణం ఎందుకు చేశాడు?" శిల్ప మరింతగా రోదించసాగింది.

"సార్! అడగాల్సిందిక్కడ కాదు. ఆ రాస్కెల్‌ని అమ్మాయిలనిలా వెంటపడి వేధించి, కాదంటే యాసిడ్ పోయడం, చంపడం లాంటి హింసకి పాల్పడుతున్న వెధవలందరిని తరిమి పట్టుకుని జైల్లో వేయండి." ఆక్రోశంతో ఉద్రేకంగా అరిచాడు వెంకట్రావు. కూతురి దుస్థితి చూసి.

ఇన్‌స్పెక్టర్ సాలోచనగా ఆయన వైపు చూసి "సార్! మీ ఆవేశం అర్థమవుతోంది. కాని జరిగిందానిలో ఆ అబ్బాయిదే కాదు, మీ అమ్మాయిదీ తప్పుంది. ఈ కాలం అమ్మాయిలు, ఏం తక్కువ తినలేదు. ఉద్యోగాల పేరున స్వేచ్ఛగా తిరగడం, అబ్బాయిలతో స్నేహాలు, సినిమాలు, షికార్లు, పార్టీల పేరుతో కలిసి తిరిగితే అబ్బాయిలు ఆశలు పెంచుకుంటే వాళ్ళనెలా తప్పుపడతారు. తిరిగినన్నాళ్ళు తిరిగి

అవసరం తీరాక నిర్లక్ష్యం చేస్తున్నారు. అది తట్టుకోలేని కొందరు అబ్బాయిలు హింసా ప్రవృత్తికి దిగుతున్నారు."

"అంటే యాసిడ్ పోయడం, చంపడం చేస్తారా? దౌర్జన్యాలకి దిగుతారా? అమ్మాయిలూ చదువుకున్నారు. తోటి ఉద్యోగితో సరదాగా ఉంటే పెళ్ళి చేసుకుంటుందనేనా అర్థం. హింసని కట్టడి చెయ్యాల్సిన మీరు ఇలా రౌడీ వెధవల ని వెనకేసుకు వస్తున్నారు. ఇన్‌స్పెక్టర్!" తీక్షణంగా అన్నాడు వెంకట్రావు.

"చూడండి సార్! హింసని, దౌర్జన్యాన్ని అరికట్టడమే మా ఉద్యోగం. కాని అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలనే చెప్తున్నాం. స్నేహం చెయ్యొచ్చు. స్నేహానికి హద్దులు ఉండాలి. వారికి ఇష్టం లేనపుడు గౌరవంగానే మొదటే దూరం పెట్టాలి. ఎవరిమీద ప్రత్యేక శ్రద్ధ చూపకుండా అందరితో స్నేహంగా ఉండి తమకి తాము గిరిగీసుకోవాలి అమ్మాయిలు. అలా హద్దులో ఉంటే అమ్మాయి దరిచేరడానికి అబ్బాయిలూ భయపడతారు. చనువిస్తే గదా! అబ్బాయిలు వెంటపడి ప్రేమ పాఠాలు వల్లించే సాహసం చేస్తారు. మీ అమ్మాయి విషయం మీకూ తెలుసు. ఎందుకు ముందే కట్టడి చెయ్యలేదు. వీళ్ళిద్దరి వ్యవహారం, పూర్తి వివరాలు నేను సేకరించాను. తిరిగినన్నాళ్ళు తిరిగాక, ఇప్పుడు అమెరికా సంబంధం కుదరగానే ఆ అబ్బాయిని దూరంపెట్టి నిర్లక్ష్యం చేస్తే, నిజంగా ప్రేమించిన ఆ అబ్బాయి మనసు దహించి తిరగబడ్డాడు. ఇదంతా ఆ అబ్బాయిని సమర్థించడానికి చెప్పడం లేదు. హింసా ప్రవృత్తిని ఎవరూ... అందులో పోలీసులం ఎప్పుడూ సహించం. ఆ అబ్బాయికి ఎలాగో శిక్ష పడ్తుంది. తనంతట తాను వచ్చి లొంగిపోయిన ఆ అబ్బాయి మాటల్లో నిజాయితీ కన్పించింది. అందుకే ఇంత మాట్లాడాను. నాశనం అయింది మీ అమ్మాయి భవిష్యత్తు కాదు. ఆ అబ్బాయి భవిష్యత్తు. కొంతమంది అబ్బాయిలు ప్రేమించమని అమ్మాయిల వెంటపడి వేధించి, కాదంటే కక్ష పెంచుకుని దౌర్జన్యాలు చేస్తున్నారు. అలాంటి వారిని కఠినాతి కఠినంగా శిక్షించాలి. కాని ఈ కేసులో మీ అమ్మాయిదీ తప్పు ఉంది. అది గుర్తించండి" కోపంగా అని బయటికి వెళ్ళాడు ఇన్‌స్పెక్టర్.

"మర్నాడు టి.వి.లలో, న్యూస్ ఛానల్స్, పేపర్లు అన్నీ ప్రముఖంగా శిల్ప, రాహుల్ గురించిన కేసులతో నిండిపోయాయి. కోర్టులో హాజరు పరిచిన రాహుల్ కేసుకి కొన్ని గంటలలోనే జడ్జి విప్లవాత్మక తీర్పు ఇచ్చారు.

సిల్పని శారీరకంగా గాయపరిచి ఆమె భవిష్యత్తును నాశనం చేసిన రాహుల్‌కి

రెండు రకాల తీర్పు ఇచ్చారు. ఒకటి శిల్పని ఆమె కోలుకున్నాక పెళ్ళి చేసుకోవాలి. రెండు, అది ఇష్టం లేకపోతే రెండు సంవత్సరాల కఠిన కారాగారం శిక్ష అనుభవించాలి. తీర్పు చెప్పాక ఇంత తొందరగా ఈకేసులో శిక్ష అమలు చేయడం వెనక ఉద్దేశం భవిష్యత్తులో ఇలాంటి హింసా ప్రవృత్తికి దిగిన దోషులకి వెంటనే శిక్షపడితే తప్పించుకునే వీలు ఉండదు. ఏళ్ళ తరబడి కేసు కొనసాగితే కేసు పల్చబడి జనం మర్చిపోతారు. ఇలా వెంటనే శిక్ష పడితే ఈ పని చేసినందుకు భయపడతారు. కనుక ఇకముందు న్యాయాధిపతులు అందరూ పాడైపోతున్న యువతని దారిలోకి తేవాల్సిన బాధ్యత గుర్తెరగాలి అన్న ఉద్దేశ్యంతో అమలు చేసాం" అంటూ జడ్జిమెంట్ చదివి వినిపించేసరికి చప్పట్లతో మారు మోగింది కోర్టు.

టి.వి.లు ఈ వార్తని ప్రసారం చేసాయి. అన్నింటికంటే రాహుల్ రెండేళ్ళ జైలు శిక్షనే కోరుకోవడం. దానికి అతను చెప్పిన కారణం ఆవేశంతో చేసిన ఈ పనికి తనలాంటి యువత శిక్ష అనుభవించడమే సరి అని చెప్పాడు.

ఆస్పత్రి బెడ్‌మీద ఉన్న శిల్ప, ఇదంతా విని అస్థిరంగా పక్కమీద దొర్లి... "నో .. అతనికి శిక్ష వద్దు... తప్పునాది..." అరిచింది.

"శిల్పా, శిల్పా... ఏమిటే ఆ కేకలు లే... లే... డ్యూటీకి టైమవుతోంది. అంత మొద్దు నిద్ర ఎలా పట్టుందే పగటిపూట? ఒకటే కలవరిస్తున్నావు?" తల్లి కుదిపి లేపితే కళ్ళు తెరిచిన శిల్ప... తెల్లబోతూ తన వంక చూసుకుంది.

చుట్టూ చూసింది.

ఓగాడ్. ఇది కలా... ఎంత ఘోరమైన కల! నిజంగా రాహుల్ కోపం మీద ఉండి అలా చేస్తే తన బతుకేం కావాలి... ప్లీజ్ రాహుల్! సారీ! నన్ను క్షమించు. రాహుల్‌ని కలవాలి. అతనికి పరిస్థితి చెప్పి శాంతపరచాలి. తన తప్పు ఒప్పుకోవాలి. పెద్దవాళ్ళు ఇష్టపడకుండా పెళ్ళి చేసుకుంటే సుఖం ఉండదని చెప్పాలి. స్నేహంగా విడిపోదామని చెప్పాలి. లేచి డ్యూటీకి తయారవుతూ రాహుల్‌కి ఎలా నచ్చజెప్పి శాంతపరచాలి? అని ఆలోచిస్తూనే ఉంది శిల్ప.

*(చిత్ర మాసపత్రిక - **2009**)*